# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

https://epaper.telanganaveena.com/

DYNAMIC 5:00PM

సోమవారం / 19.02.2024


# మహిళలకు రేవంత్ సర్కార్ శుభవార్త

**తెలంగాణ వీణ , హైదరాబాద్ :** తెలంగాణలోని మహిళలకు రేవంత్ రెడ్డి సర్కార్ తీపికబురు చెప్పింది. ఇప్పటికే.. ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వం.. త్వరలోనే ప్రతి మహిళకు నెలకు 2 వేల రూపాయలు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ లాంటి పథకాలు అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలోనే.. మరో శుభవార్తను మోసుకొచ్చింది. డ్వాక్రా సంఘాల మహిళలకు త్వరలోనే వడ్డీలేని రుణాలను మళ్లీ ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. చాలా కాలం నుంచి జీతాలు రావటం లేదని ఆశా వర్కర్లు తమ ఇబ్బందులను తన దృష్టికి తీసుకొచ్చారని భట్టి విక్రమార్క తెలిపారు. వారికి జీతాలు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతేకాదు.. గిరిజనుల అభివృద్ధి కోసం కూడా ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తున్నట్లు భట్టి చెప్పుకొచ్చారు.గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో.. రాష్ట్రంలోని స్వయం సహాయక మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందజేస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని భట్టి విక్రమార్క విమర్శించారు. అంగన్వాడీ, ఆశా వర్కర్లు, స్వయం సహాయక బృందాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, రెండో ఏఎన్ఎంల వంటి వారికి ప్రతి నెల 1వ తేదీనే జీతాలు, బిల్లులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు భట్టి పేర్కొన్నారు.



# వీఐపీ భక్తులకు మంత్రి పొంగులేటి కీలక సూచన

**తెలంగాణ వీణ , ములుగు :** తెలంగాణ కుంభమేళా మేడారం మహా జాతరకు సర్వం సిద్ధమైంది. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే జాతరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మేడారం వచ్చేందుకు ప్రత్యేకంగా బస్సులు, ట్రైన్లతో పాటు హెలికాప్టర్ ప్రయాణ సదుపాయాన్ని కూడా కల్పించారు. మేడారం జాతర ఏర్పాట్లను ఇవాళ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మరో మంత్రి సీతక్కతో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన పొంగులేటి జాతరకు ఎన్ని లక్షల మంది వచ్చినా.. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు.మేడారం జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వివిధ ప్రాంతాల నుంచి సరిపడా స్పెషల్ బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 17 కోట్ల మంది మహిళలు జీరో టికెట్‌తో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారని.. మేడారం జాతరకు వచ్చే మహిళలకు కూడా బస్సుల్లో ఫ్రీ జర్నీ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. జాతర జరుగుతున్న ప్రాంతంలో చెత్తా చెదారం పేరుకుపోకుండా ఎక్కువ మంది పారిశుధ్య కార్మికులను అందుబాటులో ఉంచామని వెల్లడించారు. మేడారం జాతరలో పర్యవేక్షణ కోసం ఐఏఎస్, ఐపీఎస్ స్థాయి అధికారులను నియమించామని చెప్పారు.

ఈ క్రమంలో జాతరకు వచ్చే వీఐపీలకు మంత్రి పొంగులేటి కీలక సూచన చేశారు. తమ వాహనాలను ములుగులోనే పార్క్ చేసి ఆర్టీసీ ఏర్పాటు చేసిన బస్సుల్లో మేడారానికి రావాలని పిలుపునిచ్చారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తలెత్తదని.. వీఐపీలు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకునే అవకాశం ఉండదని అన్నారు. భక్తులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే అధికారుల దృష్టి తీసుకురావాలని తెలిపారు. రానున్న నాలుగు రోజుల్లో దాదాపు 2 కోట్ల మంది భక్తులు మేడారం జాతరకు వస్తారని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. జాతర సంబంధించి వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ బడ్జెట్‌ను కేటాయిస్తున్నామని పొంగులేటి స్పష్టం చేసారు.




# టీడీపీ, జనసేన పై వర్మ పంచులు

**తెలంగాణ వీణ , సినిమా :** ఏపీ రాజకీయాల్లో ఇప్పుడు పొలిటికల్ మూవీల ట్రెండ్ నడుస్తోంది. ఇటీవల వైఎస్ జగన్ జీవితచరిత్రలోని ఓ భాగాన్ని కథాంశంగా తీసుకుని చిత్రించిన యాత్ర 2 సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ తర్వాత అమరావతి రైతుల కథతో రాజధాని ఫైల్స్ అంటూ మరో మూవీ రిలీజైంది. ఇక ఫిబ్రవరి 23న రామ్ గోపాల్ వర్మ డైరెక్షన్‌లో తెరకెక్కిన వ్యూహం సినిమా రాబోతోంది. ఆ వెంటనే మార్చి ఒకటో తేదీ శపథం రానుంది. అయితే ఈ సినిమాలపై గతకొంతకాలంగా సినీ, రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. తమ నాయకులను ఇందులో అభ్యంతరకరంగా చూపించారంటూ టీడీపీ, జనసేన పార్టీలు ఈ సినిమాల విడుదలను అడ్డుకున్నాయి. కోర్టును సైతం ఆశ్రయించాయి. అయితే కోర్టు అనుమతితో వ్యూహం, శపథం సినిమాలు విడుదలకు సిద్ధమయ్యాయి.ఈ నేపథ్యంలోనే తన సినిమాలపై వస్తున్న అభ్యంతరాలు, విమర్శలకు బదులిచ్చారు ఆర్జీవీ. సోషల్ మీడియాలో ఈ సినిమాలపై జరుగుతున్న ప్రచారం, ఇతర పార్టీల నుంచి వస్తున్న విమర్శలకు ఓ వీడియో ద్వారా సమాధానం ఇచ్చారు. ఎప్పటిలాగే తనదైన పంచులతో వీడియోలో విరుచుకుపడిన ఆర్జీవీ.. తాను పొద్దున్నే పోర్న్ చూసినట్లు టీడీపీ, జనసేన నేతలు కూడా తన సినిమాలను బాత్‌రూమ్‌లో కూర్చుని చూస్తారని అన్నారు. ఇష్టం ఉన్నవాళ్లు చూడండి.. లేదంటే మానేయండి అంటూ తన మార్క్ పంచ్‌తో వీడియోను ఎండ్ చేశారు. "బాక్సింగ్ రింగులోకి ఎంటరైతే గట్టిగా గుద్దాలి. అంతే కానీ జుట్టుపీకుతా, చెంపగిల్లుతా అంటే కుదరదు. నేనేమీ యాత్ర 2 సినిమా గురించి చెప్పట్లేదు. నిజాన్ని బట్టలిప్పి నగ్నంగా చూపించాలనేదే నా ఉద్దేశం. వ్యూహం, శపథం సినిమాలు పొలిటికల్ మూవీలు, టీడీపీ, జనసేన వాళ్లు చూస్తారా అనే వాళ్లకు నేను చెప్పేది ఒక్కటే. సికింద్రాబాద్‌లో చాలా ఏళ్ల క్రితం లంబా థియేటర్ ఉండేది. అందులో ఆడేవన్నీ ఆ సినిమాలే. అయితే ఇష్టమున్నా సరే.. ఆ థియేటర్‌కు పోవాలంటే జనం భయపడేవాళ్లు. పోయేవాళ్లు కాదు. కానీ అందులో ఆడే సినిమాలు ఎక్కడో అక్కడ చూసేవాళ్లు. నేను ఉదయాన్నే పోర్న్ చూసినట్లు టీడీపీ, జనసేన పార్టీ వాళ్లు కూడా వ్యూహం, శపథం సినిమాను బాత్‌రూమ్‌ల్లో చూస్తారు. న్యూట్రల్‌గా ఉండేవాళ్లు లివింగ్ రూమ్‌లో కూర్చుని చూస్తారు. మీకిష్టమైతే ఈ సినిమాలు చూడండి.. లేదంటే మానేయండి" అని తనదైన స్టైల్లో చెప్పారు ఆర్జీవీ.



# ఏపీలో మహిళలకు జగన్ సర్కార్ గుడ్‌న్యూస్..



**తెలంగాణ వీణ , ఏపీ బ్యూరో :** ఏపీ ప్రభుత్వం మహిళలకు శుభవార్త చెప్పింది. మహిళల సమగ్రాభివృద్ధి, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా చేపట్టిన వైఎస్సార్ చేయూత పథకం. 2020 ఆగస్టు 12న ప్రారంభించిన ఈ పథకం కింద 45 నుంచి 60 సంవత్సరాల వయస్సు కలిగిన అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున అందజేస్తోంది. ఇలా నాలుగు దఫాల్లో రూ.75 వేల ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారు స్వశక్తిపై ఎదిగేందుకు, సుస్థిరమైన జీవనోపాధి పొందేందుకు తోడ్పాటునందిస్తోంది. వైఎస్సార్ చేయూత పథకం కింద ఇప్పటి వరకూ మూడు విడతల్లో భారీగా నిధుల్ని మహిళలకు అకౌంట్లలో జమ చేశారు.ఈ పథకానికి సంబంధించిన నిధుల్ని ఈ నెల 16న విడుదల చేస్తారని ప్రభుత్వం తెలిపింది. అయితే కొన్ని అనివార్య కారణాలతో వాయిదా పడింది. అయితే ఈ నెల 21న వైఎస్సార్ చేయూత నిధుల్ని చిత్తూరు జిల్లా కుప్పంలో విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ రోజున ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బటన్ నొక్కి మహిళల అకౌంట్‌లలో డబ్బుల్ని జమ చేయనున్నారు. ఈ పథకం కింద లబ్దిదారులకు గత మూడేళ్లలో రూ. 666.50 కోట్లను అందజేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో నివసించే మహిళలు రూ. 478.49 కోట్ల సాయం పొందగా.. పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలు రూ. 188.01 కోట్లు అకౌంట్‌లలో జమ చేశారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి మొత్తం 1.50 లక్షల మంది మహిళలకు రూ. 250 కోట్ల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.రాష్ట్రవ్యాప్తంగా 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయసు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సంబంధించిన మహిళలకి ఆర్థిక వేసులుబాటు కలిగించే ఉద్దేశంతో వైఎస్సార్ చేయూత పథకం అమలు చేస్తున్నారు. ఈ పథకం క్రింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారికి రూ.18,750 అందిస్తున్నారు. ఈ పథకం కేవలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారికే మాత్రమే. ఈ పథకానికి ధరఖాస్తు చేసుకునేవారికి ఆధార్ కార్డు, రైస్ కార్డు / తెల్ల రేషన్ కార్డు, బ్యాంకు అకౌంట్ ఉండాలి.అలాగే మొత్తం కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతంలో అయితే రూ.10వేలు.. పట్టణ ప్రాంతంలో అయితే రూ.12 వేలకు మించకూడదు. మొత్తం కుటుంబానికి మూడెకరాల మాగాణి లేదా పది ఎకరాల మెట్ట లేదా మాగాణి మెట్ట రెండు కలిపి పది ఎకరాలకు మించకూడదనే నిబంధన ఉంది. కుటుంబంలో ఎవరికీ ప్రభుత్వ ఉద్యోగం చేయకూడదు.. ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకునేవారు అనర్హులు. కుటుంబం నివసిస్తున్న ఇంటి కరెంట్ బిల్ 300 యూనిట్లకు లోబడి ఉండాలి. పట్టణ ప్రాంతంలో సొంత ఇంటి కోసం స్థలం ఉన్నట్లయితే అది 750 చదరపు గజాల లోపు ఉండాలి. కుటుంబంలో ఏ ఒక్కరు కూడా ఆదాయ పన్ను చెల్లించే వారు ఉండకూడదు..కుటుంబంలో ఎవరికీ నాలుగు టైర్ల వాహనాలు ఉండకూడదు.వైఎస్ఆర్ చేయూత పథకానికి గ్రామ, వార్డు సచివాలయంలో మాత్రమే దరఖాస్తు చేయొచ్చు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేవారు పైన తెలిపిన పత్రాలను గ్రామ వాలంటీర్‌కు అప్లికేషన్ జతచేసి అందజేయాలి. ఆ అప్లికేషన్‌ను అర్హులుగా జాబితాల చేరుస్తారు. ఆ తర్వాత సర్వే చేసి అర్హుల జాబితాను ఫైనల్ చేస్తారు.. గ్రామ, వార్డు సచివాలయాల్లో వీటిని అందుబాటులో ఉంచుతారు. ఆ తర్వాత బ్యాంకు అకౌంట్లలో జమ చేయనున్నారు.

# నాపై అకారణంగా అవిశ్వాసం పెట్టారు

**తెలంగాణ వీణ ,మేడ్చల్ :** తనపై అకారణంగా అవిశ్వాసం పెట్టారని, అసమ్మతి వర్గంలోని కొంతమంది తమ స్వలాభం కోసం ఈ పని చేశారని మేయర్ అవిశ్వాస తీర్మానంలో ఓడిపోయిన మేకల కావ్య ఆవేదన వ్యక్తం చేశారు. అసమ్మతి వర్గంలో భూకబ్జాదారులు ఉన్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జవహర్ నగర్ మేయర్ మేకల కావ్యపై అసమ్మతి వర్గం అవిశ్వాస తీర్మానం పెట్టింది. జవహర్ నగర్ నగర పాలక సంస్థలో మేయర్ సహా 28 మంది కార్పొరేటర్లు ఉన్నారు. సోమవారం ఓటింగ్ నిర్వహించగా అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 20 మంది ఓటు వేశారు. మేకల కావ్యకు అనుకూలంగా కేవలం నాలుగు ఓట్లు మాత్రమే వచ్చాయని తెలుస్తోంది.మొత్తం 28 మంది కార్పొరేటర్లు ఉండగా గతంలో అనారోగ్యంతో 16వ డివిజన్ కార్పొరేటర్ మృతి చెందారు. దీంతో 27 ఓట్లకు గాను మేకల కావ్యకు వ్యతిరేకంగా 20 ఓట్లు పడ్డాయి. మేయర్ మేకల కావ్యపై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ఆర్డీవో ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వివరాలను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఓటింగ్ సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జవహర్ నగర్ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారు. అవిశ్వాసం నెగ్గడంతో మేయర్ కావ్య కార్పొరేషన్ కార్యాలయం నుంచి బయటకు వెళ్లిపోయారు. కాగా, త్వరలో కొత్త మేయర్‌ను ఎన్నుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

